క్లుప్తంగా

బ్రహ్మావతిని పరామర్శించిన జయప్రకాష్



బ్రహ్మావతిని పరామర్శిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు, మాజీ డిప్యూటీ మేయర్ గంపల బ్రహ్మావతిని ఆపార్టీ ఏలూరు సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్ సోమవారం పరామర్శించారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని ఆమె నివాసంలో పార్టీ నేతలతో కలిసి ఆయన పరామర్శించారు. బ్రహ్మావతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. రాబోయే కాలంలో పార్టీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్ గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, నాయకులు మద్దాల ఫణి, దాలి వెంకటేష్, సత్యనారాయణ, అట్టాడ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

లింగ వివక్ష అనాగరికం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై కాంతిప్రియ

ఏలూరు (ఆర్ఆర్పేట): అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు సమానంగా రాణిస్తోన్న స్త్రీలను తక్కువ చేసి చూడడం తగదని, లింగ వివక్షత అనాగరికమని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరి బాబు అన్నారు. నవంబర్ 25 నుంచి ఈనెల 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ కాంపెయిన్ నయీ చేతన 3.0లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మధ్యాహ్నం లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై వి.కాంతి ప్రియ మాట్లాడుతూ స్త్రీలపై హింసను నిరసిస్తూ, అలాంటి ఘటనలు జరిగినప్పుడు తెలియజేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్ను విద్యార్థులకు తెలిపారు. అనంతరం కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడారు. వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎస్ పరమేశ, టి.వెంకట దుర్గాప్రసాద్, ఎస్ సుస్యలత, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

శునకాల స్వైరవిహారం

- హడలిపోతున్న ఏలూరు నగర వాసులు
- చిన్నారులు, వాహనదారులను వెంటాడుతున్న కుక్కలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల బెడద ఎక్కువై ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై వీధి కుక్కలు వెంటాడి దాడి చేస్తున్నాయి. రోడ్లపై ఇష్టానుసారంగా సంచరిస్తున్న వీధికుక్కల నుంచి తమను కాపాడాలంటూ ప్రజలు పలుసార్లు అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. పలు సందర్భాల్లో కుక్కల దాడిలో గాయపడటం, వాహనాలపై నుంచి పడిపోవడం వంటి ఘటనలు అనేకం ఉన్నాయి. అత్యధికంగా విద్యా సంస్థలు ఉన్న ఏలూరు నరసింహారావుపేట ప్రాంతంలో సైతం కుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నాయి. పాఠశాలలకు, కాలేజీలకు వచ్చి వెళ్లే విద్యార్థుల పైనా, ఆస్పత్రులకు వచ్చి వెళ్లే రోగులు, వారి బంధువులపైనా కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. నగరంలోని ఒన్టౌన్ ప్రాంతంలోని పడమర వీధి, తూర్పువీధి, దక్షిణపు వీధి, మెయిన్ బజార్, టూటైన్ ప్రాంతంలోని ఆర్ఆర్పేట, ఎస్ఆర్పేట, పత్తేబాద, పవరుపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో త్రీటౌన్ ప్రాంతంలోని గ్రేవియర్ నగర్, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. తక్షణం వీధికుక్కల బెడదను అరికట్టాలని నగరపాలక సంస్థ అధికారులను నగర ప్రజలు కోరుతున్నారు.



తంగెళ్లమూడి ప్రాంతంలో మెడికల్ షాపు వద్ద వీధి కుక్కలు



పవరు పేటలోని ఒక వీధిలో సంచరిస్తున్న కుక్కలు

నగరంలో మూడు వేల కుక్కలు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 50 డివిజన్ల పరిధిలో అనధికార లెక్కల ప్రకారం మూడు వేల వరకు వీధి కుక్కలు ఉన్నట్టు సమాచారం. నగరపాలక సంస్థ అధికారులు మాత్రం నగరంలో 1900 నుంచి రెండు వేల వరకు మాత్రమే వీధి కుక్కలు ఉన్నట్టు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రతి డివిజన్ పరిధిలో 40 నుంచి 50 వరకు కుక్కలు రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇంతపెద్ద మొత్తంలో కుక్కలు తిరుగుతున్నా వాటి బెడదను అరికట్టేందుకు అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుక్కలు కరిచిన సందర్భంలో ఆస్పత్రులు పాలవుతున్న వారి పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది.

వీధి కుక్కలకు వ్యాక్సిన్ లేదా?

ఏలూరు నగరం పరిధిలో దాదాపు 3,500 నుంచి నాలుగు వేల వరకు పెంపుడు కుక్కలు ఉన్నాయి. వీటన్నింటికీ జూలై నెలలో యాంటీ రాబీస్ దినోత్సవం సందర్భంగా అన్ని పశువైద్యశాలలో పెద్ద ఎత్తున యాంటీ రాబీస్ వ్యాక్సిన్లు వేస్తున్నారు. ఇదే సమయంలో వీధి కుక్కలను పట్టించుకునే వారు లేరు. వాటికి వ్యాక్సినేషన్ జరగడం లేదు. దీంతో ఇవి ప్రజలపై దాడి చేయడంతో బాధితులు ఆస్పత్రుల చుట్టూప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు సంబంధించిన ఇంజక్షన్లు అందుబాటులోకి లేకపోవడంతో ప్రైవేటు వైద్య శాలలను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలపై చర్యలు ఏవీ



నగరంలో వీధి కుక్కల బారి నుంచి ప్రజలకు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందించాం. ఎక్కడెక్కడ కుక్కలు అధికంగా ఉన్నాయనే వివరాలను అందజేశాం. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామంటూ చెప్పి కాలం గడిపేస్తున్నారు.

– ఎ.రాణి, జిల్లా కార్యదర్శి, ఐద్వా, ఏలూరు

శస్త్రచికిత్సలు చేసేలా చర్యలు



వీధి కుక్కల బెడద నుంచి నగర ప్రజలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. వీధి కుక్కల సంతానం అభివృద్ధి చెందకుండా ఉండే విధంగా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల దీనికి సంబంధించిన కేంద్రాన్ని ప్రారంభించాం. హర్యానాకు చెందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నిరోధక శస్త్ర చికిత్సలు, యాంటీ రాబీస్ వ్యాక్సిన్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జి.చంద్రయ్య, ఇన్చార్జి ఎంహెచ్ఓ, నగరపాలక సంస్థ, ఏలూరు

ఏఆర్ డీఎస్పీ శ్రీహరికి అభినందన



ఏఆర్ డీఎస్పీని అభినందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో 25వ ఆలిండియా ల్యాండ్ టెన్నిస్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరిరావును ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీఎస్పీ శ్రీహరిరావు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెంగుళూరు కీసెల్బియా స్టేడియం క్యూబన్ పార్క్‌లో గత నెల 25 నుంచి 30 వరకు నిర్వహించిన పోటీల్లో ఓపెన్ డబుల్‌లో డీఎస్పీ శ్రీ హరిరావు ఓపెన్ డబుల్ లోరన్నరప్‌గా గెలుపొందారని తెలిపారు. టెన్నిస్ పోటీల్లో విజయం సాధించిన ఏఆర్ డీఎస్పీ ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్ ఉన్నారు.

నగరంలో అభయ రక్షక పోలీస్ దళం



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మహిళలు, విద్యార్థినులు ఆపదలో అండగా నిలిచేందుకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేక శ్రద్ధతో అభయ మహిళా పోలీస్ రక్షక దళం ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా ఎస్సై క్రాంతి ప్రియ నగరంలో అభయ రక్షక దళం గస్తీపై అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఏలూరు నగరానికి వచ్చే సందర్భంలో ఆటోల్లో ప్రయాణిస్తూ ఉంటారని, ఒంటరి మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లకు ఉందని అన్నారు. ఎవరైనా ఆకతాయిలు ఆటోల్లో మహిళలు, బాలికలు ప్రయాణించే సమయాల్లో వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఆటో డ్రైవర్లు ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఆర్ పేట, వన్‌టౌన్‌లోని కస్తూరిబాయ్ స్కూల్ తదితర ప్రాంతాల్లో సరైన కారణాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న విద్యార్థులను గమనించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

పోలి స్వర్గ దీపోత్సవం



అవిముక్తేశ్వర స్వామి దేవస్థానం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్పేట) : కార్తీక మాసం ఆఖరి రోజున పోలి స్వర్గం కార్యక్రమాన్ని నగరంలోని మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, దీప అలంకరణలు, విశేష పూజలు చేశారు. ఆలయం ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారపు పేటలో షిర్డీ సాయి ప్రేమ మందిరం సాయి మహిళా సేవకుల ఆధ్వర్యంలో మందిర ఆవరణలో జ్యోతులను వెలిగించి దీపోత్సవం నిర్వహించారు. 40వ డివిజన్ అవిముక్తేశ్వర ఆలయం ప్రాంగణం ఎదుట శ్రీ భారతి విద్యా సంస్థల మహిళా ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో దీపాలతో అలంకరణ చేశారు. కొత్తపేట 35వ డివిజన్‌లో గౌరీ పరమేశ్వర ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. పోలి స్వర్గం సందర్భంగా కృష్ణకాల్వకు, కోనేరులకు మహిళలు తెల్లవారుజామునే వెళ్లి దీపాలు ఒదిలారు.

చుక్కల్లో గుడ్డు ధర

- మార్కెట్‌లో రూ.7 పలుకుతున్న గుడ్డు ధర
- ఉత్పత్తిలో 80 శాతం గుడ్లు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



దెందులూరు : మూడేళ్ల క్రితం కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైంది. చికెన్, గుడ్డు కారణంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందుతోందంటూ వదంతులు రావడంతో ఒక్కసారిగా పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పట్లో చికెన్ ధర పతనం కాగా గుడ్డు ధర సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.25కు పతనమైంది. అయితే కరోనా కట్టడిలో పౌష్టికాహారమైన కోడిగుడ్డు, చికెన్ ప్రాధాన్యం పెరగడంతో పాటు ప్రభుత్వం, వైద్యులు సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పౌల్ట్రీ పరిశ్రమకు కలిసి వచ్చింది. ఇటీవల గణనీయంగా గుడ్డు, చికెన్ వినియోగం పెరగడంతో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కోడిగుడ్డు నెక్ ధర రూ.6.50 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.7 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ధర గతంలో ఎప్పుడూ నమోదు కాలేదని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.

తగ్గిన ఉత్పత్తి

జిల్లాలో 160 వరకు పౌల్ట్రీలుండగా వీటిలో సుమారు 90 లక్షల వరకు కోళ్లు పెరుగుతున్నాయి. వీటి ద్వారా నిత్యం కోటిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. సాధారణ రోజుల్లో ఉత్పత్తిలో 80 శాతం మేర కోడిగుడ్లు పొరుగు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఒడిశా, అసోం, బీహార్ వంటి రాష్ట్రాలకు ఎగుమతవుతుంటాయి. మిగిలిన 20 శాతం స్థానికంగా వినియోగిస్తుంటారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా పౌల్ట్రీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన కృషితో పౌల్ట్రీ పరిశ్రమ మరోసారి నిలదొక్కుకుంది. సాధారణంగా వర్షాకాలం, శీతాకాలంలో గుడ్డు వినియోగం పెరుగుతుంది. ఎగుమతులకు డిమాండ్ పెరిగి ఏటా సీజన్‌లో రైతు ధర సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. వేసవిలో 20 శాతం వరకు ఉత్పత్తి పడిపోగా రోజుకు లక్ష కోళ్లు మృత్యువాత పడ్డాయి. మేత ధరలు సైతం గణనీయంగా పెరగడంతో రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. రిటైల్ మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7 వరకు విక్రయించే అవకాశం ఉంది. చలికాలంలో గుడ్డు వినియోగం పెరగడం, క్రిస్మస్, న్యూ ఇయర్ కేకుల తయారీలో వాడనుండటంతో రేట్లు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.

శ్మశాన వాటిక కబ్జాపై ఆందోళన



రాజవరంలో శ్మశాన వాటిక వద్ద ఆందోళన చేస్తున్న మైనారిటీలు

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీలోని శ్మశాన వాటిక కబ్జాకి గురవుతోందంటూ మైనారిటీలు సోమవారం ఆందోళన నిర్వహించారు. నూర్ బాషా దూదేకుల శ్మశాన వాటిక 33 సెంట్లు ఉండేదని, ఇప్పుడది క్రమేపీ కబ్జాకి గురవుతోందని పేర్కొన్నారు. ఊర్లోని మురుగునీరు బరల్ గ్రౌండ్‌లోకి రావడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని, దీంతో బరల్ గ్రౌండ్లో చేసే కార్యక్రమాలకు విఘాతం కలుగుతోందని తెలిపారు. సీసీ డ్రెయిన్, గ్రావెల్ రోడ్డు నిర్మించాలని కోరినా ప్రయోజనం లేదని సంఘ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్ అన్నారు. స్పందనలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, మురుగునీటి వ్యవస్థ ఉండడం వల్ల శ్మశానంలోకి వచ్చే జంతువుల వల్ల పవిత్రతకు భంగం వాటిల్లుతోందని వివరించారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సంఘ సభ్యులు కోరారు. షేక్ మస్తాన్ వలీ, ఎస్ హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి : స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పోతునూరు గ్రామంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒక మహిళను అరెస్ట్ చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహణ కేసులో ముద్దాయి పరసా రాంబాబుతో పాటు అదే గ్రామానికి చెందిన సారా పాత కేసులో ముద్దాయి బాలిన ఏడుకొండలును తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ కేసు నమోదు చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

వేలేరుపాడు: మండలంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న నలుగురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. తెలంగాణ మద్యం 101, ఆంధ్ర మద్యం 7 సీసాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీఐ పీఎస్‌డీ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల్లో రాష్ట్రం రెండో స్థానం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్

కొయ్యలగూడెం: బాలిక వివాహాల విషయంలో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిశోర బాలికా వికాసం (2.0) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం కిశోర బాలికా వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు అవగాహన కల్పించాలని, పెళ్లి మాత్రమే కాదు నిశ్చితార్థం కూడా తీవ్రమైన నేరంగా పరిగణింపబడుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్యవివాహాలు చేస్తుంటే కాల్ సెంటర్ నంబర్ 1098కి తెలియజేయాలన్నారు. బాల్య వివాహ నిషేధం, ఆత్మరక్షణ, జీవనోపాధి అవకాశాలు, లింగ పక్షపాతం, పోషకాహారం, ఆరోగ్యం, విద్య ఋతు సంబంధ హైజెనిక్, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, డ్రాపౌట్స్ బాలికలను గుర్తింపు తదితర అంశాలపై అధికారులకు సిబ్బందికి వివరించారు. ఈవోపీఆర్‌డీ జి.సతీష్, ఎంఈఓ జె.సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యల తిష్ట

బుట్టాయగూడెం: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలన్ని సోమవారం బీజేపీ నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం నాయకులు కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల, సోము హరినారాయణలు మాట్లాడుతూ వసతిగృహాల్లో పలు సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణబాబు, ఎస్సై రామకృష్ణ, చిత్రంలో నిందితులు

జంగారెడ్డిగూడెం రూరల్: మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ కృష్ణబాబు తెలిపారు. లక్కవరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆ కేసు వివరాలను ఎస్సై రామకృష్ణతో కలిసి ఆయన వివరించారు. గత నెల 28న తన మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన కొలూరి బాల పవన్ కిషోర్ ఫిర్యాదు చేశారన్నారు. ఆదివారం పుట్లగట్లగూడెం గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, చోరీ చేసిన మోటార్ సైకిళ్లతో ఇద్దరు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులు భీమడోలుకు చెందిన మందపాటి జీవన్‌కుమార్, బొమ్ము వెంకటేశ్వరరావులు చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. మోటార్ సైకిళ్ల చోరీకి సంబంధించి గతంలో నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసులు ఉన్నాయన్నారు. జీవన్‌కుమార్ గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడి ఏలూరు సబ్ జైల్‌కి వెళ్లి వచ్చాడని తెలిపారు. వీరిని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. కేసును చేధించిన సీఐ కృష్ణబాబు, ఎస్సై రామకృష్ణలతో పాటు సిబ్బందిని డీఎస్పీ యు.రవిచంద్ర అభినందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	80
పచ్చిమిర్చి	20-26	బీట్‌రూట్	60
కాకర కాయలు	28-36	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	46	అల్లం	70
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	58-64	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-58	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40